క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా నార్సింగి విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని వాసవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆలీజాపూర్, పాషా కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామంలో రెండు రోజుల పాటు నిర్వహించే క్రీడాపోటీలు శనివారం నుంచి ప్రారంభం అవుతాయని శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు తెలిపారు. సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని శిశు మందిర విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, జూనియర్, సీనియర్ స్థాయిలలో జరుగుతాయన్నారు. దాదాపు వెయ్యి మందికిపైగా మూడు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్టలెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్న ప్రభ తెలిపారు. వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, గణితం, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులు బోధించడానికి సంబంధిత సబ్జెక్టులో పీజీ 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు యాభై శాతం మార్కులు ఉన్న వారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ ఉన్న వారికి అదనపు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఔత్సాహికులైన అభ్యర్థులు ఈ నెల 4 సాయంత్రంలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6 తేదీన హయత్‌నగర్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. వివరాలకు ఫోన్: 94419 56233లో సంప్రదించాలన్నారు.

బాలికల వసతి గృహం ప్రారంభం



శంషాబాద్: జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే ఎస్సీ విద్యార్థుల (బాలికల) ప్రభుత్వ వసతి గృహంను శుక్రవారం పట్టణంలో ప్రారంభించారు. ఏఎస్‌డబ్ల్యూ అధికారి వెంకటేష్, ఎస్సీ విద్యార్థుల వసతి గృహాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పూరి కుమార్ హాస్టల్ సంక్షేమాధికారులు సులోచన, మదన్‌గౌడ్ పాల్గొన్నారు. ప్రభుత్వం కల్పించిన వసతి గృహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలుంటాయన్నారు.

5 నుంచి అంతర్జాతీయ వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఏడీపీపీపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'మనూ' ప్రొఫెసర్, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ప్రియా హసన్ తెలిపారు. భౌతిక శాస్త్రం, గణితశాస్త్ర విభాగంతో పాటు పూణేలోని యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5 నుంచి 8వ తేదీ వరకు పైథాన్‌తో ఖగోళ శాస్త్ర డేటా విశ్లేషణపై నాలుగు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశామన్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు సయ్యద్ హమీద్ లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తారన్నారు.

పార్కుల్లో పచ్చదనాన్ని పెంచాలి

గోల్కొండ: పార్కుల్లో పచ్చదనాన్ని పెంచాల్సిన బాధ్యత స్థానికులపై ఉందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్ కుంటలోని పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పార్కు ఇతర పార్కులకు ఆదర్శంగా నిలవాలన్నదే తన అభిమతమన్నారు. హకీంపేట్ పరిసరాల్లో బస్తీలకు ఇదొక్కటే పార్కు అని ఈ పార్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివిధ రకాల మొక్కలతో పాటు ఔషధ మొక్కలను కూడా ఇక్కడ నాటామన్నారు. ఈ పార్కును మరింత అభివృద్ధి చేసేందుకు తాను బల్దియా ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతానని ఆయన అన్నారు. తమ ప్రాంతంలోని పాఠశాలల విద్యార్థులు సైతం పార్కును సందర్శించేలా బస్తీ, కాలనీ వాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.



కోకాపేటలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు



మణికొండ శివాలయ ప్రాగణంలో కలశానికి పూజలు చేసి మట్టిని పోస్తున్న దృశ్యం

కార్గిల్ అమరులకు నివాళి

- ప్రేమావతిపేటలో 'మేరీ మట్టి మేరా దేశ్'
- ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలో దేశ ప్రగతి
- బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



కలశంలో మట్టి పోసి పూజలు నిర్వహిస్తున్న కార్గిల్ యుద్ధంలో పోరాడి వీర మరణం పొందిన కీర్తిచక్ర మేజర్ వినయ్ మాతృమూర్తి జయశ్రీ తదితరులు

రాజేంద్రనగర్/మైలార్‌దేవ్‌పల్లి: దేశ ప్రతిష్టను పెంచేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.సత్యనారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ అసెంబ్లీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రేమావతిపేట భవానీ కాలనీలో మేరీ మట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పోరాడి వీర మరణం పొందిన కీర్తి చక్ర మేజర్ కె.పి.వినయ్ మాతృమూర్తి కె.పి.జయశ్రీ, అన్న కె.పి.విక్రమ్, వదిన కె.పి.ఉజ్వలతో కలిసి మేరీ మట్టి మేరా దేశ్ కలశం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ ప్రధాని నరేంద్రమోడీ 75 సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటి నుంచి మట్టి తీసుకొని ఢిల్లీ అమరవీరుల స్థూపం దగ్గర మొక్కలు నాటడం జరుగుతుందన్నారు. ఈ మొక్కలకు కలిశాలలో తీసుకొని మట్టితో మొక్కలు నాటారన్నారు. పూజా కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు గుమ్మడి రామచంద్రారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడికే రాజు, అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.సుధాకర్, జిల్లా ధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు, మూల శ్రీనివాస్‌గౌడ్, పి.సందీప్‌ముదిరాజ్, బి.బాలకృష్ణ, నల్లింగ్ రమేష్, విశ్వనాథం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహనీయులను దేశ ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు..

మణికొండ: దేశ రక్షణకు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా అర్పించిన మహనీయులను దేశ ప్రజలు ఎప్పటికి గుర్తుంచుకుంటారని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జ్ టి.అంజన్‌కుమార్‌లు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ మేరీ మటి మేరీ దేశ్ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. శుక్రవారం మణికొండ మున్సిపల్ పరిధిలోని మణికొండ శివాలయంలో పూజలు నిర్వహించి ప్రాంగణంలోని మట్టిని సేకరించారు. దీనిని కలశంలో పెట్టి పూజలు నిర్వహించారు. పూజల్లో బీజేపీ మణికొండ మున్సిపల్ అధ్యక్షులు సి.బీరప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రాఘవరెడ్డి, పి.సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు జె.లక్ష్మీ, జిల్లా నాయకులు సి.హెచ్.ఇందిర, కె.శ్రీనివాస్‌రెడ్డి, కె.నర్సయ్యాచారి, హంసరాజు, బదేలు, వినోద్, ఆనంద్‌రావు, వెంకటచారి, మధు, ప్రతాప్‌రెడ్డి, రంగాబాబు, కొమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోకాపేటలో మట్టి సేకరణ

మణికొండ: ప్రధాని నరేంద్రమోడీ పిలుపు మేరకు మెరీ మట్టి–మెరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు శుక్రవారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట గ్రామంలో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు టి. అంజన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ... దేశాన్ని శత్రు దేశాల నుంచి కాపాడుతూ ప్రాణాలు కోల్పోయిన సైనికులకు, అమరవీరులకు ఢిల్లీలో 75 ఎకరాల్లో స్ఫూర్తి వనం నిర్మించేందుకు ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట నుంచి సేకరించామన్నారు. నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతి యాదవ్, మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి. లక్ష్మీనారాయణ, ఎం. నగేష్‌యాదవ్, రాఘవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వసతులు



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్ వెల్లడించారు. శుక్రవారం శివాజీనగర్‌లో రూ. 3.10 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... అటు హుడా కాలనీ ఇటూ పాండురంగానగర్ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి శివాజీనగర్‌కు పోటెత్తడంతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఇళ్లల్లోకి నీరు చేరి వర్షం పడినప్పుడల్లా ఈ వరద ప్రమాదానికి భయభ్రాతులకు గురవుతున్నారన్నారు. సమస్యను పరిశీలించి వెంటనే అధికారులతో చర్చించి వర్షం నీరు వెళ్లేందుకు నీటి పైపులైన్‌లను వేయించడం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తిన నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీజేపీ అర్బన్ జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, నల్లింగ్ రమేష్, బిట్కూరి సిద్దేశ్వర్, వెంకటేష్, గురుప్రీత్‌సింగ్, సంతోష్, జీహెచ్ఎంసీ వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రాజు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే నిర్మాణ వ్యర్థాలు



కాళీకానగర్‌లో రోడ్డుపై సంచుల్లో నింపిపెట్టిన మట్టి

బండ్లగూడ: ఇంటి నిర్మాణ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేస్తుండడంతో స్థానికంగా ఉండే ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారుతుంది. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో పరిస్థితి దారుణంగా మారుతుంది. కాళీకానగర్, బండ్లగూడ, కిస్మత్‌పూర్, పీరంచెరువు తదితర ప్రాంతాలలో ఇంటి నిర్మాణం కోసం తెచ్చుకున్న ఇటుకలు, ఇసుక, మట్టి, డస్ట్ తదితర వాటిని రోడ్ల మధ్యనే డంప్ చేస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో నిర్మాణాలు పూర్తైపోయిన వాటిని తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించే వారే కరువైయ్యారని స్థానికులు వెల్లడిస్తున్నారు. రోడ్లపై పేరుకుపోతున్న వ్యర్థాల కారణంగా స్థానికంగా ఉండే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డును ఆక్రమిస్తు సంగం వరకు ఈ మట్టి, ఇటుకలు, డస్ట్, సిమెంట్ సంచులే ఉండటంతో దారిలో ప్రయాణించేందుకు వీలులేకుండా పోతుందని వాహనాదారులు వాపోతున్నారు. ఇదే విషయాన్ని అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వెల్లడిస్తున్నారు. ఇకనైనా అధికారులు ఇలాంటి చర్యలను ఆపేలా చూడాలని కోరుతున్నారు.

పురాతన కట్టడాలకు పునర్ వైభవం కల్పిస్తాం



మీరాలంమండిలో పురాతన కట్టడాలను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

చార్మినార్: పాతబస్తీలో పురాతన కట్టడాలకు పునర్ వైభవం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. శుక్రవారం కమిషనర్ సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ శంకర్‌లాల్, సీఈ గురువీర, ఈఈ శంకర్, జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి పలు పురాతన కట్టడాలకు ప్రతిపాదించిన పనులను కమిషనర్ పరిశీలించారు. ముందుగా కమిషనర్ దారుషిఫా (ఓల్డ్ ఎంసీహెచ్ ఆఫీస్) సర్దార్ మహల్, చార్మినార్ ఓల్డ్ బస్టాండ్, ముర్గీచౌక్, ఖుర్షీద్ ఝూ దేవిడి, సాలార్‌జంగ్ మ్యూజియం ఎదురుగా ఐకాన్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే స్థలాన్ని పరిశీలించారు. ఒక్కొకటి రూ.30 కోట్లతో చేపట్టే ముర్గీచౌక్, సర్దార్ మహల్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. చార్మినార్ ఓల్డ్ బస్టాండ్ అభివృద్ధికి బీఓటీ పద్ధతిపై నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖుర్షీద్ ఝూ దేవిడి రూ.12 కోట్ల అంచనాతో చేపట్టనున్న పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సాలార్‌జంగ్ మ్యూజియం వద్ద రెండు వైపుల రూ.40 కోట్ల అంచనా వ్యయంతో ఐకాన్ బ్రిడ్జి చేపట్టనున్నారని తెలిపారు.

శ్యాంరావు ముదిరాజ్‌కు మదర్ థెరిస్సా అవార్డు

చార్మినార్: 20 ఏళ్లకు పైగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ప్రముఖ సంఘ సేవలకుడు, టీపీసీసీ ఓబీసీ సెల్ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యనిర్వాహక కార్యదర్శి కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్‌కు మదర్ థెరిస్సా స్మారక అవార్డు–2023 వచ్చింది. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ పాల్గొన్నారు.

వివాదాస్పద భూముల కబ్జాను అడ్డుకోండి

పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్

శంషాబాద్: ప్రభుత్వానికి, ప్రయివేటు వ్యక్తుల మధ్యన వివాదాస్పందంగా సాతంరాయి సర్వేనంబరు 17 భూముల్లో ముఖ్యనేత అండదండలతో స్థానిక ప్రజాప్రతినిధితో పాటు అతని అనుచరులు చొరబడుతున్నారని పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ అన్నారు. శుక్రవారం సంబంధిత భూములను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పి. సంజయ్‌యాదవ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ్ తదితరులతో కలిసి ఆయన సందర్శించారు. దళితులకు చెందిన సంబంధిత భూములను ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వానికి చెందినట్లుగా రాయడంతో వివాదాస్పదంగా మారాయన్నారు. సదరు భూములుపై ప్రస్తుతం హై కోర్టు స్టే ఉండటంతో ఎవరూ అందులోకి ప్రవేశించేందుకు అనుమతి లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు కీలక నేత అండతో కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. తవ్వకాలు కూడా చేపట్టారన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు స్పందించకపోతే ధర్నా చేపట్టి, న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

ఓటరు జాబితాలో తప్పలను సవరించండి: బీజేపీ

శంషాబాద్: అసంబద్ధంగా.. అస్తవ్యస్తంగా ఉన్న ఓటరు జాబితాను సవరించాలని బీజేపీ శంషాబాద్ నేతలు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం సమర్పించారు. గతంలో పలుమార్లు ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇంత వరకు అధికారులు స్పందించలేదని బీజేపీ నాయకులు ఆరోపించారు. పట్టణంలో గతంలో 28 బూత్‌లు ఉండగా ప్రస్తుతం 33 కి పెరిగినా బూత్‌ల వారిగా ఓటర్లకు క్రమపద్ధతిలో చేర్చకుండా అస్తవ్యస్తంగా చేర్చారన్నారు. ఒక వార్డులోని ఓటర్లు మరో వార్డు పరిధిలోకి రావడంతో సామాన్యులు, నిరక్షరాస్యులు తమ ఓటు ఎక్కడ ఉందో తేల్చుకోలేక ఓటు హక్కును కోల్పోయే అవాకాశముందన్నారు. తప్పుల సవరణకు గడువు సమీపిస్తున్న కారణంగా ఓటరు జాబితాను త్వరగా సవరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.దేవేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని కులాల అభ్యున్నతికి కృషి

జియాగూడ: సీఎం కేసీఆర్ అన్ని కులాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. శుక్రవారం జియాగూడ సంజయ్‌నగర్ లోని సంత్ రవిదాస్ భవనంలో సంత్ రవిదాస్ మోచి సమాజ్ సేవా సంఘం అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్ ఆయనను సన్మానించారు. అనంతరం కాంతీలాల్ మాట్లాడుతూ.. సంజయ్‌నగర్ మోచి సమాజ్ వారికి గృహలక్ష్మి పథకం, దళిత బంధు అమ లు చేయాలని కోరారు. మిత్రకృష్ణ మాట్లాడుతూ..ఎస్సీ కులాల వారితో పాటు అన్ని కులాలకు సీఎం కేసీఆర్ ఆర్థిక సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మోచి సమాజ్ కులాస్తులకు ప్రభుత్వ పథకాలు వెంటనే అందేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్ సభ్యులు మనోహర్ మాహోరే, వినోద్ దయాల్, ముఖేష్ మాహోరే, నర్సింగ్ పర్వారే, బీఆర్ఎస్ నాయకుడు ఉమేష్ మహేష్కర్, గణేష్, అభిషేక్ మిత్ర, గణేష్ దేవికర్ పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌లు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. లబ్ధిదారులతో మాటామంతి కలిపారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మొదటి దఫాగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పేదల పట్ల ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. దీనికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మంజూరే చక్కటి నిదర్శనమన్నారు. లక్కీడ్రా పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. వీటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మి వ్రతాలు



సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ చైతన్య విల్లాస్ కాలనీలోని రామాలయంలో దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు మహేష్, ఉమామహేశ్వరి, పద్మశ్రీ, కనకదుర్గల ఆధ్వర్యంలో 3వ శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలను నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పూజల్లో వనిత, శారద, అర్చన, రామతులసి, అరుంధతి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి: పీఆర్‌టీయూ



వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ సభ్యులు

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు కె.కేశవులు, ప్రధాన కార్యదర్శి ఎస్.రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా పాలనాధికారికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిరసన చేపట్టారు. ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి పెన్షన్ విద్రోహ దినంగా నిరసన తెలిపారు. లక్షలాది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష మేరకు ప్రభుత్వన్ని సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని కోరారు.

మహిళా సాధికారతకు కృషి

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ బీజేరావు

రాయదుర్గం: మహిళా సాధికారత కోసం 75 ఏళ్లుగా ప్రయత్నిస్తున్నామని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు పేర్కొన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సహకారంతో మహిళా సాధికారతపై 'ఎంపవర్–20' అనే అంశంపై ఒకరోజు సింపోజియంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 75 ఏళ్ళు అయినా ఇంకా సాధికారిత అనే అంశం చాలా దూరంగా ఉందని భావించాల్సి వస్తోందన్నారు. సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ కె సునీతారాణి, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ జ్యోతిర్మయిశర్మ మాట్లాడుతూ సాధికారతను సాధించడంలో బహుత్వ ప్రాముఖ్యతను చూపారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రోగ్రామ్ హెడ్ ఉదయశంకర్ మాట్లాడుతూ సామాజిక సాధికారత సాధించడంలో లోటుపాట్లను పూరించాల్సిన ఆవశ్యకతపై వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ బడుగుల సుమతి, సంవాద్ భాగస్వాములు ఏక్తాబహ్లా, తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ శాంతాథౌతం, ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త వైజయంతి వసంత, జహీరాబాద్‌లోని సంఘం రేడియో మేనేజర్ నర్సమ్మ, ఆకాశవాణి హైదరాబాద్ ప్రొగ్రామ్ ఎగ్జిక్యూటివ్ నిహారా కానేటి ప్రసంగించారు.

ఉపాధ్యాయులది కీలకపాత్ర

కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న అతిథులు

శేరిలింగంపల్లి: సమాజంలో ఎక్కువగా గౌరవించబడేవారు ఉపాధ్యాయులేనని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి నల్లగండ్ల రవీందర్‌రెడ్డి గార్డెన్స్‌లో మండల రికగ్నైస్డ్ ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలకపాత్ర పోషించేది టీచర్లేనన్నారు. కార్యక్రమంలో ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్ రఘునందన్‌రావు, శేరిలింగంపల్లి ఎంఈఓ వెంకటయ్య, బిజ్జం ట్రస్ట్ వ్యవస్థాపకులు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, ఎస్‌ఎన్‌రెడ్డి, అనిల్‌కుమార్, జి నారాయణరెడ్డి, భరత్‌గౌడ్, మీనేందర్‌రావు, ఆచార్య, శ్రీనివాసశంకర్, అబ్దుల్ రహమాన్, భీష్మారెడ్డి, జి శ్రీనివాసరావు, రమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తాం: వినోద్‌కుమార్



బి.వినోద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వహీద్ అహ్మద్

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని తెలంగాణ రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్ అన్నారు. సీఎం కేసీఆర్ మైనార్టీలకు లక్షలాది రూపాయల రుణాలు ఇవ్వడంతో పాటు నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్‌లు ఇస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు వహీద్ అహ్మద్ శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌లాంటి గొప్ప వ్యక్తిత్వం ఉన్న సీఎం మరేరాష్ట్రానికి లేరని, ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవని ఆయన అన్నారు. మంత్రి కేటీఆర్ చొరవ వల్ల రాష్ట్రంలో పరిశ్రమలు బాగా పెరిగి నిరుద్యోగులకు ఉపాధి లభించిందని ఆయన అన్నారు. ముచ్చటగా మూడవ సారి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కాబోతున్నారన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ తదితరులున్నారు.